

గొర్రెల పంపిణీకి మోక్షమెప్పుడు?

- నిలిచిపోయిన రెండో విడత పంపిణీ
- మూలధనం వాటా చెల్లించి ఎదురుచూపులు
- పథకంపై స్పష్టత ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆందోళనలో లబ్ధిదారులు

కాసిపేట, మే 19: గొల్లకుర్మలను ఆర్థికంగా బలోపేతం చేసి ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన గొర్రెల పంపిణీ కార్యక్రమం తీసుకొచ్చింది. కుల వృత్తులను ప్రోత్సహించడంలో భాగంగా గొల్ల కుర్మలకు గొర్రెలు ఇచ్చేందుకు 2017 జూన్‌లో కేసీఆర్ ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. మంచిర్యాల జిల్లాలో మొదటి విడతలో 5833 మందికి గొర్రెలు పంపిణీ చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశారు. కానీ 5719 మందికి గొర్రెల పంపిణీ గ్రౌండింగ్ చేశారు. మొదటి విడతలో జరిగిన పొరపాట్లను అధిగమించేందుకు రెండో విడతను 2018 మార్చిలో రెట్టింపు ఉత్సాహంతో ప్రారంభించారు. 5786 మందికి గొర్రెలు పంపిణీ చేయాలనే లక్ష్యంతో ప్రారం భించిన రెండో విడత పంపిణీ పక్కదారి పట్టింది. రాష్ట్రంలో పశు సంవర్ధక శాఖ అధికారులు గొర్రెల కొనుగోలు చేసి ఇచ్చే ఏజెన్సీలు కుమ్మక్కై దళారులకు కాసుల పంట కురిపించారు. దీంతో గొర్రెల పంపిణీ ప్రారంభానికి ముందే విమర్శలు ఎదుర్కొంది. రెండో విడతలో 5786 మందికి గొర్రెలు పంపిణీ చేయాలనే లక్ష్యాన్ని నిర్ధేశించగా కేవలం 2297 యూనిట్‌లు గ్రౌండింగ్‌కు నోచుకున్నాయి. మూలధనం వాటా చెల్లించిన లబ్ధిదారులకు ఐదేండ్లు గడిచినా గొర్రెలు రాక, ఇటు డబ్బులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

● ఆందోళనలో లబ్ధిదారులు

కేసీఆర్ ప్రభుత్వం ఆడంబరాలకు పారిపోయి విచ్చలవిడిగా యూనిట్లను మంజూరు చేసి లబ్ధిదారుల నుంచి మూలధనం వాటాలను డీడీల రూపంలో వసూలు చేసింది. ఒక్కో యూనిట్‌కు రూ.43,750 ప్రభుత్వ ఖాతాలో లబ్ధిదారులు జమ చేశారు. కానీ జిల్లాలో ఇప్పటివరకు ఐదేండ్లు గడిచినా గొర్రెల పంపిణీ జరక్కపోవడంతో లబ్ధిదారులు ఆందళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 1500 మంది రూ. 6.5 కోట్ల డబ్బులు చెల్లించి ఉన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి ఆదుకోవాలని లబ్ధిదారులను కోరుతున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ప్రకటించ లేదు.

● గొర్రెల పంపిణీ ఇలా...

మొదటి విడతలో లబ్ధిదారుని వాటా రూ.31,250 చెల్లిస్తే రూ.1.25 లక్షల విలువ గల 20 గొర్రెలు, ఒక పొట్టేలును లబ్ధిదారునికి అంద జేశారు. రెండో విడతలో రూ.43,750 మూలధనం వాటాను లబ్ధిదారులు చెల్లిస్తే రూ.1.75 లక్షల విలువ గల 20 గొర్రెలు, ఒక పొట్టేలును కొందరికి అందజేశారు. లబ్ధిదారులకు ఇచ్చేందుకు సరిపడ గొర్రెలు లేకపోవడంతో మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకున్నారు. అయినప్పటికి లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు సరిపోకపోవడంతో ఇతర గొర్రెల మందలను చూ పించి డబ్బులు డ్రా చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. ఇలా రీసైకిల్ చేసినప్పటికీ గొర్రెల యూనిట్లు సరిపోకపోవడంతో పథకం పూర్తి స్థాయిలో విఫలమైందనే ఆరోపణలు ఉన్నాయి.

అప్పులు తెచ్చి డీడీ కట్టిన

- ముత్యాల రాజయ్య యాదవ్, ధర్మారావుపేట



గొల్లకుర్మలకు గొర్రెల యూనిట్లు ఇస్తామంటే 2018లో రూ.43,750 అప్పులు తెచ్చి డీడీ కట్టిన. కానీ 5 ఏండ్లు అయినా గొర్రెలు రాలేదు. పైసలు ఇస్తలేరు. తెచ్చిన అప్పుకు వడ్డీ పెరిగిపోతుంది. మాలాంటి నిరుపేద కుటుంబాలకు ఆర్థికభారం పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించి గొర్రెలను అందజేసి ఆదుకోవాలి.

గొర్రెల పంపిణీకి ప్రభుత్వం చొరవచూపాలి

- కొమ్ము అశోక్ యాదవ్, గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



లబ్ధిదారులందరికి గొర్రెల యూనిట్లు అందేలా ప్రభుత్వం చొరవ చూపాలి. గతంలో డీడీలు కట్టిన లబ్ధిదారులు నష్టపోకుండా ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలి. ప్రభుత్వాలు మారినప్పటికీ ప్రజలకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. ఎక్కువ మంది గొల్లకుర్మలు అప్పులు తెచ్చి డీడీలు చెల్లించార్రు. గొర్రెలను అందించేలా ప్రభుత్వం కృషి చేయాలి.

ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం

- డాక్టర్ రమేష్, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి



రెండో విడత గొర్రెల పంపిణీ కోసం లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వానికి నివేదికలను అందజేశాం. కొత్త ప్రభుత్వ సూచన మేరకు కార్యాచరణ ఉంటుంది. డీడీలు కట్టి గొర్రెలు రాని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లాలో గొర్రెల పథకం పారదర్శకంగానే జరిగింది. మున్ముందు కూడా ప్రభుత్వ ఆదేశాలతో అర్హులైన లబ్ధిదారులందరికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఏకరూప దుస్తులు అందించాలి

- జూన్ 1 నాటికి కుట్టడం పూర్తయ్యేలా ప్రణాళిక
- స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగింత
- జిల్లాకు 263 బేళ్ల క్లాత్ కేటాయింపు



క్లాత్‌బేళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు (ఫైల్)

ఏసీసీ, మే 19: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి ఒక జత దుస్తులు, అనంతరం మరో జత అందించనున్నారు. జిల్లాలో 1 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు 43714 మంది ఉన్నారు. బాలురకు ప్యాంటు, షర్టు, బాలికలకు టాప్ గౌను, ప్యాంట్, వెస్ట్‌కోట్ సిద్ధం చేస్తున్నారు. జిల్లాకు 263 బేళ్ల క్లాత్ కేటాయించారు. జిల్లాకు కేటాయించిన క్లాత్ మండలాల స్టాక్ పాయింట్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాలకు, పట్టణ ప్రాంతాల్లో మెప్మా ఆధ్వ ర్యంలో ఆయా మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు ఏకరూప దుస్తులు కుట్టడానికి క్లాత్‌ను ఎంఈవోల ద్వారా అందించారు. డ్వాక్రా మహిళ స్వయం సహాయక సంఘాలు కుట్టే ఒక్కో జత ఏకరూప దుస్తులకు ప్రభుత్వం రూ.50 చెల్లించనుంది. కుట్టడానికి అవసరమైన దారం, గుండీలు, జిప్పులు, ఇతర సామగ్రిని సంఘాలే సమకూర్చుకోవాలి.

- నెలాఖరులోగా పూర్తిచేయాలి

జూన్ 1 నాటికి ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు, డీఈవో, డీఆర్‌డీవో, ఎంపీడీవోలు, విద్యాశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారం భమయ్యే నాటికి విద్యార్థులకు ఒక జత ఏకరూప దుస్తులను అందించాలని లక్ష్యంగా పని చేస్తున్నారు. ఒక్కో మండలంలో 2, 3 కుట్టు కేంద్రాలను ఏర్పా టు చేసి మహిళలు ఏకరూప దుస్తులను తయారు చేయడంలో నిమగ్నమయ్యారు.

గడువులోగా పూర్తి చేయాలి

- డీఈవో యాదయ్య



గడువులోగా ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తి చేసి ఎంఈవోలకు అప్పగించాలి. విద్యార్థుల కొలతలకు అనుగుణంగా దుస్తులు ఉండేలా శ్రద్ధ వహిస్తున్నాం. ప్రస్తుతం ఒక జత దుస్తులు తయారు చేసి జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి విద్యార్థులకు అందించనున్నాం.

నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా

ఏసీసీ, మే 19: నకిలీ విత్తనాలను అరికట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసినట్లు సీపీ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధనార్జనే ధ్యేయంగా కొందరు అక్ర మార్కులు బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ విత్తనాలు విక్రయిస్తుంచడంతోపాటు కొన్ని కంపెనీల కాలం చెల్లిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి కొత్త విత్తనాలుగా చెప్పి రైతులకు అమ్ముతున్నారన్నారు. నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు వాడితే సరైన దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులు నకిలీ విత్తనాల మురాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నకిలీ విత్తనాల స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. నకిలీ విత్తనాల విక్రయం, రవాణాను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్, ఇతర అధికారులతో కలిసి బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయం, రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విత్తన, ఎరువుల దుకాణాలు, గోదా ములను తనిఖీలు చేసి అనుమానం వచ్చిన శాంపిళ్లను పరీక్షకు పంపిస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాల అక్రమార్కులపై పీడీయాక్టు అమలు చేసేందుకు జాబితా సిద్ధం చేసినట్లు తెలిపారు.

ధాన్యాన్ని వెంటనే తరలించాలి

భీమారం, మే 19 : కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి తరలించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు కలగూర రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకపోవడంతో వర్షాల నుంచి ధాన్యంను కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని, టార్పాలిన్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కేంద్రాల వద్ద రైతులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం వెంటనే వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

మందమర్రిటౌన్, మే 19: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధాన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన పూజలను నిర్వహించారు. హోమంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. కల్యాణ వేడుకలకు జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు కుటుంబీకులతో కలిసి హాజరై పూజలు చేశారు. భక్తులు స్వామి వారి కీర్తనలను ఆలపించారు. మందమర్రి జీఎం మనోహర్ దంపతులు హాజరై పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు అనంతాచార్యులు మాట్లాడుతూ సకల జనుల హితం కోసమే కల్యాణమన్నారు. స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉంటాయని తెలిపారు. సనాతన హిందూ సంప్రదాయాల్లో స్వామి కల్యాణం ఒకటని తెలిపారు. ఈ కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

భూకబ్జా ముఠాపై చర్యలు తీసుకోవాలి

చెన్నూరు, మే 19 : చెన్నూరు పట్టణంలో కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి నిరుపేదల భూములను కబ్జా చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బండారి చిన్నన్న అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నూరు పట్టణంలోని కుమ్మరిబొగుడ కాలనీలో గల 4 గుంటల భూమిని 2014లో ఎరుకల దేవయ్య అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి రిజిష్టర్ చేసుకున్నానని తెలిపారు. 8ఏండ్ల తర్వాత దేవయ్య, మద్దెల భవానీ, గోపినాథ్, తరగం వెంకటేష్‌లు నా భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గుంట భూమి ఇస్తావా లేదంటే రూ.6 లక్షలు ఇవ్వాలని మద్దెల భవానీ వేధింపులకు గురి చేస్తుందన్నారు. ఇదేమని అడిగితే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయిస్తానని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. భూములను కబ్జా చేస్తూ వేధింపులకు గురి చేస్తున్న ముఠాపై పోలీసులు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేపై చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదు

చెన్నూరు, మే 19 : చెన్నూరు నియోజకవర్గంలో ఐకేపీ, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలుకు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల శ్రీనివాస్, అఖిల్, సుధాకర్‌లు అన్నారు. ఆదివారం చెన్నూరులో వారు మాట్లాడుతూ ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేపై కొంత మంది బీఆర్ఎస్ నాయకులు కావాలని అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని, ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

దండేపల్లి,మే19: కన్నెపల్లిలో శాతరాజు లింగయ్య-లక్ష్మి దంపతుల కుమార్తె శిరీష వివాహ ఖర్చుల కోసం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం గూడెం మాజీ ఎంపీటీసీ ముత్తె నారాయణ రూ. 5వేలు అందజేయగా, మాజీ వార్డు సభ్యుడు చుంచు నగేష్ 75 కేజీ బియ్యం అందించారు.

ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి



మంచిర్యాల, దండేపల్లిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 19: జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోమాస ప్రకాష్ సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడై పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా, ఎమ్మెల్యేగా సేవలందించారని పేర్కొన్నారు. నాయకులు ప్రభాకర్, కుమారస్వామి, మోహన్, రాజ్‌కుమార్, రాములు, రాజు, రాందాస్ పాల్గొన్నారు.

కాసిపేట: సోమగూడెం మైదానంలో పుచ్చలపల్లి సుం దరయ్య వర్ధంతిని సీపీఎం నాయకులు నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్దయ్య, శ్రీనివాస్, పోశం, శ్రీనివాస్, సదానందం, రాజలింగు, కౌశిక్, శ్రీనివాస్, ప్రేంకుమార్ పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలోని తాపీ మేస్త్రీ సంఘం భవనంలో సుందరయ్య వర్ధంతిని సీపీఎం నాయకులు నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మ, నగేష్, ఉమారాణి, సమ్మక్క, రాజేశ్వరి, చంద్రన్న, మారన్న, రేణుక పాల్గొన్నారు.

దండేపల్లి: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి దండేపల్లిలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఆయన ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలన్నారు. లచ్చగౌడ్, రాజలింగు, రమేష్, ఎల్లయ్య, మహేశ్వరీ, శ్యామల, తారబాయ్, వెంకటేష్, సునీత, సుజాత, బాపు, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ప్లాట్ల యజమానులకు అనుకూలంగా తీర్పు



తీర్పు కాపీలు ప్రదర్శిస్తున్న కొనుగోలు దారులు

ఏసీసీ, మే 19: జిల్లా కేంద్రంలోని ఉమర్‌మియా హౌజింగ్ సొసైటీ భూములను కొనుగోలు చేసిన వారికి అనుకూలంగా హైకోర్టు తీర్పు వచ్చిందని ప్లాట్ల యజమానులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమర్‌మియా హౌజింగ్ సొసైటీ సభ్యులు, ప్లాట్ల యజమానులు కలిసి పాల్గొన్నారు. సొసైటీ అధ్యక్షుడు జుబేర్ అహ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం నరేష్, వైస్ ప్రెసిడెంట్ కేశవులు మాట్లాడుతూ ఉమర్‌మియా కాలనీ మంచిర్యాల పట్టణంలో టూ టౌన్‌లో 1978లోనే లేఅవుట్ అనుమతి పొందిన వెంచర్ అన్నారు. 2008 నుంచి కొందరు భూకబ్జాదారులు ప్లాట్లపై కన్నేసి కాజేయాలనే దురుద్దేశ్యంతో తప్పుడు కేసులు పెట్టారన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి ప్లాట్లను అమ్మేశారన్నారు. 12 ఎకరాల స్థలంలో 86 ప్లాట్లు ఏర్పాటు చేశారన్నారు. అందులో ప్లాట్లు కొన్న 17 మంది ఇంటి నిర్మాణానికి మున్సిపాలిటీకి దరఖాస్తులు చేసుకోగా అనుమతులు రాలేదని, దీంతో హైకోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టు దస్తావేజులు, సాక్ష్యాలను పరిశీలించి ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించిందన్నారు. ఈ లేవుట్‌లో ఎకరం పావు భూమిని మున్సిపాలిటీకి అప్పగించామన్నారు. సొసైటీ భూముల అక్రమాల్లో ఇద్దరు కౌన్సిలర్ల పాత్ర ఉందని ఆరోపించారు. సొసైటీలో భూముల పేరిట మోసానికి గురైన వారు పోలీసులను ఆశ్రయించాలన్నారు. సొసైటీ సభ్యులు చెక్క రాజయ్య, ఎండీ హైదర్, ఆకుల బుచ్చన్న పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వేమనపల్లి, మే 19: ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దని ఎస్ఐ శ్యాంపటేల్ అన్నారు. శనివారం రాత్రి మంగెనపల్లి గ్రామంలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో మూఢనమ్మకాల నిర్మూలన, సైబర్ క్రైం, షీటీం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లాలని, మూఢ నమ్మకాలను నమ్మవద్దన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఏటీఎం, పిన్, ఓటీపీ నెంబర్లు చెప్పవద్దన్నారు. మహిళల భద్రతకు షీటీంలు ఉన్నాయని, ఎవరైనా వేధిస్తే షీటీంలను సంప్రదించాలన్నారు. బాల్య వివాహాలు నేరమన్నారు. ఎవరికైనా ఆపద ఎదురైతే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



రామకృష్ణాపూర్, మే 19: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 1997లో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. చిన్ననాటి మిత్రుడు కలవేన సంపత్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఆదివారం రూ.30 వేలు అందజేశారు. అనంతరం సంపత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



దండేపల్లి,మే 19: ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని, లేకుంటే జరిమానాలు తప్పవని ఎస్సై భూమేష్ హెచ్చరించారు. దండేపల్లిలో ప్రధాన రహదారిపై ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టి మద్యం సేవించిన, వాహన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఎస్సై మాట్లాడుతూ వాహనాలకు సంబం ధించిన ధ్రువీకరణ పత్రాలు లేని వాహన దారులకు జరిమానాలు విధిస్తామన్నారు. రోడ్డు భద్రత, నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

విద్యార్థికి సన్మానం



జన్నారం, మే 19 :మండలంలోని కవ్వాల గ్రామానికి చెందిన విద్యార్థి ఏల్పుల రాజేందర్‌ను ఆదివారం గ్రామస్థులు తారుఫ్ ఆలీఖాన్, తైవార్ ఖాన్‌లు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ రాజేందర్ అజీమ్ ప్రేమ్‌జీ నిర్వహించిన జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి భోపాల్ యూనివర్శిటీలో బీఏ హానర్స్‌లో సీటు సాధించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థితోపాటు అతని తండ్రి శంకర్‌ను సన్మానిం చారు. ఎండీ రియాజుద్దీన్, కలిరం, శేషారావునరేష్, శేఖర్, అంజద్‌పాషా, శేఖర్, షైముత్‌ఖాన్, సక్రు నాయక్, మల్లేష్, శ్రీను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై నిరసన

జగిత్యాలరూరల్, మే 19: ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. జగిత్యాల జిల్లా జగిత్యాల మండలం గోపాల్‌రావుపేట ఐకేపీ సెంటర్‌లో అదే గ్రామానికి చెందిన అంబటి సందీప్ అనే యువ రైతు తన ధాన్యాన్ని 27 రోజులు గడిచినా అధికారులు తూకం వేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ తన వద్ద కుప్పపైన డీజిల్ పోసి నిప్పంటించే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న స్థానిక రైతులు రైతును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతు సందీప్ మాట్లాడుతూ అధికారులు పట్టించుకోకపోవడంతోనే కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందన్నాడు. తూకం వేయమంటే ఏదో కారణం చెబుతూ ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదన్నారు. లారీలు, రైస్‌మిల్‌ను రైతులే మాట్లాడుకోవాలని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారన్నారు. ఐకేపీ సెంటర్‌లో కనీస మౌలిక వసతుల ఎలేవని ఆవేదన వ్యక్తం చేశారు. . ఇప్పటివరకు సెంటర్‌లో 30 శాతం కొనుగోళ్లు మాత్రమే జరిగాయని, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట స్థానిక రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

- వైభవంగా పల్లవోత్సవం, వసంతోత్సవం

ధర్మపురి, మే 19: ధర్మపురి నరసింహ నవరాత్రోత్సవాలు ఏడవ రోజు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయ అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మన్యసూక్త, రుద్రాభిషేకం, పంచోపనిషత్తులచే విశేష పూజలు, సప్త హారతులు, మహా నివేదన, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పల్లవోత్సవం, వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఆలయ మండపంలో అందంగా వివిధ రకాల చెట్ల కొమ్మలతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. గోధూళి సుముహూర్తమున అర్చకులు స్వామి వారల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠ పైకి తీసుకవచ్చి ఆశీనులు చేశారు. అనంతరం పంచోపనిషత్తుల పారాయణ పూర్వకంగా వేద మంత్రాలు పఠించారు. పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాది కార్యక్రమాలు జరిపి పల్లవోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లారీ, వ్యాన్ ఢీ.. ఒకరి మృతి

కొడిమ్యాల, మే 19: మండలంలోని పూడూర్ గ్రామ శివారులో ఉన్న బ్రిడ్జ్‌పై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత లారీ వ్యాన్ ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన దామెర రాజేశ్వర్‌రెడ్డి వ్యాన్‌లో కరీంనగర్‌లో పాలను లోడు చేసుకొని భీంగల్‌కు బయల్దేరాడు. మార్గ మధ్యలో మండలంలోని పూడూర్ గ్రామ శివారులో గల బ్రిడ్జ్ వద్ద రాత్రి (జీజే-25-యు-9696) నెంబరు గల లారీ ఎదురుగా వస్తున్న పాల వ్యాన్‌ను వేగంగా ఢీకొట్టాడు. దీంతో లారీ అదుపు తప్పి వ్యాన్‌పై పడటంతో వ్యాన్ డ్రైవర్ రాజేశ్వర్‌రెడ్డి(43)కి తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోని మృతి చెందాడు. రాజేశ్వర్‌రెడ్డి భార్య దామెర వనజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంతో బ్రిడ్జిపై లారీ బోల్తా పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొడిమ్యాల ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్థుల సహకారంతో సంఘటన స్థలంలో వాహనాలను క్రేన్‌లతో తొలిగింశారు. బ్రిడ్జ్‌పై నుంచి వాహనాలు రాక పోకలు సాగించడానికి పోలీసులు సుమారు 10 గంటలు శ్రమించారు. అనంతరం బ్రిడ్జ్‌పై నుంచి రాకపోకలు పునరుద్ధరించారు.

ప్రారంభమైన కొండస్వామి బ్రహ్మోత్సవాలు

మెట్‌పల్లి రూరల్, మే, 19 : మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండపై 18వ శతాబ్ధంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్స వాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా బండలింగాపూర్ సంస్థాన్ నుంచి జగ్గసాగర్ ఆలయంలోని ఉత్సవ మూర్తులను తీసుకరావడం అనవాయితీగా జరుగుతుంది. ఉత్సవ మూర్తులను డప్పు చప్పుల మధ్య ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో ఏర్పాటు చేసి శోభయాత్రగా గ్రామం లోని కొండ స్వామి ఆలయానికి గంగపుత్రులు తీసుకొచ్చారు. ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసిన పురోహితులు అభిషేకాలు, అర్చనలు అలంకరణ, పూజలు, హారతి తదితర వంటి కార్యక్రమాలను జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గంగపుత్రులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నాగంపేటలో వ్యక్తి అదృశ్యం

గంభీరావుపేట, మే 19: గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన కోళ భూమాగౌడ్ అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. కోల భూమాగౌడ్ ఈనెల 15న బుధవారం గొల్లపల్లి కి సామాను తీసుకొని వస్తానని ద్విచక్రవాహనంపై వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. వారి బంధువులు ఎంత గాలించినా భూమగౌడ్ ఆచూకీ లభించలేదు. సమీప బంధువుల గ్రామాలకు వెళ్లి వెతికిన ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీస్ స్టేషన్లో భూమాగౌడ్ కూతురు ఫిర్యాదు చేసింది. భూమాగౌడ్ కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు

పెళ్లి కాలేదని యువతితో రెండో వివాహం

-పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

-నిందితుడిపై కేసు

కరీంనగర్ క్రైం, మే 19: తనకు తల్లిదండ్రులు లేరని, పెళ్లి కాలేదని అబద్ధాలు చెప్పి మొదటి భార్య ఉండగానే మళ్లీ వివాహం చేసుకుని యువతిని మోసం చేసిన వ్యక్తితో పాటు అతడి కుటుంబ సభ్యులపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌కు చెందిన యువతి కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నది. ఆమె తండ్రి మరణించగా సోదరుడు ఆమెకు వివాహ సంబంధాల కోసం 2021లో వావిలాలపల్లిలోని మ్యారేజ్‌బ్యూరోలో సంప్రదించాడు. హైదరాబాద్‌కు చెందిన ఒక సంబంధం వచ్చినట్లు, అబ్బాయి వివరాలను మ్యారేజిబ్యూరో నిర్వాహకులు బాధితరాలుకు ఇచ్చారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న రాంనగర్‌లోని ముషీరాబాద్‌కు చెందిన సీహెచ్ వెంకట రాఘవేంద్రరావుతో సంప్రదింపులు జరపగా అతనికి వివాహం కాలేదని, తల్లిదండ్రులు లేరని చెప్పాడు. ఇద్దరు పరస్పరం ఇష్టపడ్డారు. ఈ మేరకు వెంకటరాఘవేంద్రరావు, అతని పిన్నిగా సత్యవతి అనే మహిళతో వచ్చి 2021 ఆగస్టు 25న కరీంనగర్‌లో వరపూజ చేసుకున్నారు. అదే సమయంలో 5 లక్షల నగదు, 2 తులాల బంగారనం వరకట్నం ఒప్పుకుని 50 వేల రూపాయలు ముట్టజెప్పారు. పెళ్ళికి ఎవరినీ ఆహ్వానించవద్దని వెంకటరాఘవేంద్ర కోరగా కుటుంబ సభ్యుల సమక్షంలోనే 2022 జూన్ 26న ఎల్ఎండీ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఇద్దరు వివాహం చేసుకున్నారు. పెళ్ళి అనంతరం హైదరాబాద్‌కు వెళ్ళి రాంనగర్ ప్రాంతంలో గది అద్దెకు తీసుకుని ఉన్నారు. వారానికి రెండు మూడు రోజులు ఇంటి వద్ద ఉండి ఆఫీస్ పనిఉందని మిగతా రోజులు ఇంటికి వచ్చేవాడు కాదు. అనుమానం వచ్చి ఆరాతీయగా ఉద్యోగం చేస్తున్న విషయం నిజమేనని వెల్లడైంది. వెంకటరాఘవేంద్ర ఆధార్‌కార్డు చిరునామా ఆధారంగా అతని ఇంటికి వెళ్ళగా అతని ఇంటిలో తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులు, మొదటి భార్య ఉన్నారు. దీనిపై వెంకటరాఘవేంద్ర నిలదీయగా కులంపేరుతో దూషించి, చేతులతో కొట్టి బెదిరించాడని బాధితురాలు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పెద్దూర్ శివారులో ఇసుక డంప్‌లు

సిరిసిల్ల రూరల్, మే 19: సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూరు శివారులోని అపెరల్ పార్కు ప్రాంతంలో ఇసుక డంప్‌ను పోశారు. సిరిసిల్లలో ఇసుక రవాణాకు పోలీసులతో పాటు రెవెన్యూ అధికారులు ఆంక్షలు విధించడంతో ఇసుక దొరకడం కష్టంగా మారింది. దీంతో ఇసుకకు డిమాండ్ ఉండడంతో పెద్దూర్, సర్ధాపూర్‌కు చెందిన కొంత మంది ఇసుక స్మగ్లర్లు ఆదివారం గ్రామ శివారులో డంప్ చేసి రాత్రిపూట లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సోమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


ఓదెలు మృతదేహం

బెల్లంపల్లి, మే 19: సమీపంలోని ఇంట్లో విద్యుత్ సరఫరా రాకపోవడంతో సర్వీస్ వైర్ తనిఖీ చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి చెందాడు. పట్టణంలోని బెల్లంపల్లి బస్తీకి చెందిన బొల్లి ఓదెలు (40) ఇంటి సమీపంలోని ఒకరి ఇంట్లో విద్యుత్ రావడం లేదని ఓదెలుకు తెలిపారు. ఓదెలు విద్యుత్ స్తంభం ఎక్కి సర్వీసు వైరును చెక్ చేస్తుం డగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న సీఐ దేవయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఐదుగురిపై గృహహింస కేసు నమోదు

నెన్నెల, మే 19: అదనపు కట్నం కోసం వేధించిన ఐదుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. నెన్నెలకు చెందిన మౌనిక (హరిత)తో పెద్దపల్లి జిల్లా గుర్రంపల్లికి చెందిన నాగులమల్యాల రాజుతో 2023లో పెళ్లి జరిగిందని చెప్పారు. కట్న కానుకలు ఇచ్చి వివాహాన్ని ఘనంగా జరిపించారు. వివాహమైన 15 రోజుల నుంచే అదనపు కట్నం తేవాలని భర్త రాజు చిత్రహింసలు పెట్టేవాడని పేర్కొన్నారు. అత్త అమ్మాయి, మామ ఆనందం, ఆడపడుచు బ్రహ్మోజు స్వప్న, ఆమె భర్త రవిబాబు సైతం మౌనికను మానసికంగా వేధించేవారని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

గంజాయి రవాణా, విక్రయదారుల అరెస్టు

ఏసీసీ, మే 19: గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హమాలీవాడ, తిలక్‌నగర్‌లలో నివాసం ఉండే పొలవేని రాకేష్, గొడిసెల చాణక్యలు కొంత కాలంగా మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి రైలు ద్వారా మంచిర్యాలకు తరలించి విక్రయిస్తున్నారన్నారు. ఆదివారం మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడ్డారన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.20 వేలు విలువ చేసే 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న స్థానికులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 19: హైటెక్ సిటీ కాలనీలోని మైత్రి యోగా అండ్ నేచర్ క్యూర్ సెంటర్ డాక్టర్ సుకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో మహిళలు లిఖిత, చైతన్య, మనీషాలతోపాటు 25 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు సత్యనారాయణ, శ్రీనివాస్, శైలజ, ప్రేం కుమార్‌సింగ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రజల సంరక్షణే ప్రథమ కర్తవ్యం

రామకృష్ణాపూర్, మే 19: ప్రజల సంరక్షణ పోలీసుల ప్రథమ కర్తవ్యమని ఏఎస్సై శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆన్‌లైన్ మోసాలు, నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రించవచ్చన్నారు. గ్రామాల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ సంపత్, రాజమౌళి, కానిస్టేబుల్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యుల్లో అక్షర కాంతులు

- అందరికి విద్య అందించడమే లక్ష్యం
- నవ భారత్ సాక్షరతా పథకానికి త్వరలో శ్రీకారం



అక్షరాలు దిద్దిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్ (ఫైల్)

దండేపల్లి, మే 19: ప్రతీ ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే విధంగా కేంద్ర ప్రభుత్వం నవ భారత్ సాక్షరత(ఎన్ఐఎల్పీ) న్యూఇండియా లిటరసీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వయోజనులకు చదవడం, రాయడం రావాలనే ఉద్దేశ్యంతో ఎన్ఐఎల్పీ పేరుతో పథకాన్ని ప్రారంభించింది. సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా చేపట్టిన సాక్షరభారత్ కార్యక్రమం ఆరేళ్ళ క్రితం నిలిచిపోయింది. అప్పటి నుంచి వయోజనులకు అక్షరాలు నేర్పించే కార్యక్రమం ఆటకెక్కింది. అయితే నవభారత్ సాక్షరతా ద్వారా నిరక్షరాస్యులైన వయోజనులందరినీ వచ్చే ఐదేళ్లలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 15ఏళ్ల పై బడిన నిరక్షరాస్యులను లక్ష్యంగా పెట్టుకొని ఐదు దశల్లో వారికి శిక్షణ ఇచ్చి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతోపాటు నైపుణ్యంతో స్వయం ఉపాధి పొందే శక్తివంతులుగా మార్చడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ పథకాన్ని విజయవంతం చేసేందుకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చించనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పథకం ప్రారంభం నుంచి నవ భారత్ సాక్షరత పథకం ప్రారంభం కానుంది.

వాలంటీర్ల భాగస్వామ్యంతో

స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వాలంటీర్లతో సాయంత్రం వేళలో కార్యక్రమాన్ని అమలు చేస్తారు. దీనిని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తారు. స్థానిక భాషల్లో ఉపాధ్యాయ శిక్షణ పొందిన యువత, పొదుపు సంఘాల మహిళలు, ఉన్నత విద్యావంతులను వాలంటీర్లలుగా భాగస్వాములను చేస్తారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో కార్యక్రమాన్ని బలోపేతం చేయనున్నారు. ఎక్కువ నిరక్షరాస్యులు ఉన్న గ్రామాలను గుర్తించి నవభారత్ సాక్షరత పథకాన్ని ప్రారంభిస్తారు.

జిల్లాలో 84,480 మంది నిరక్షరాస్యులు

జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో 84,780 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు గుర్తించారు. ఇందులో పురుషులు 31,767, మహిళలు 53వేలు, ట్రాన్‌జెండర్స్ 13 మంది ఉన్నారు. కార్యక్రమాన్ని విడుతల వారీగా చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. మొదటి విడతలో దండేపల్లి, భీమిని, నెన్నెల, కన్నెపల్లి, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పథకం అమలు ఇలా..

- నవభారత్ సాక్షరతా పథకం అమలుకు పాఠశాలను యూనిట్‌గా తీసుకుంటారు.
- లబ్ధిదారులు, వాలంటీర్ల సర్వే నిర్వహణకు పాఠశాలను ఉపయోగిస్తారు.
- వివిధ వయస్సుల వారికి విభిన్న వ్యూహాలు, వినూత్న కార్యక్రమాలు చేపట్టేందుకు రాష్ట్రాలకు వెసులుబాటు ఉంటుంది.
- ప్రాథమిక అక్షరజ్ఞానం, సులువైన లెక్కలు చేయడం 15ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులకు నేర్పిస్తారు.
- పథకం పురోగతిని యాడైస్, ఈ-పోర్టల్ ద్వారా వివరిస్తారు.
- 15- 35 ఏళ్ల వారికి తొలి ప్రాధాన్యం. వీరిలో బాలికలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంచార జాతుల వారికి, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులకు అవకాశం ఉంటుంది.
- మహిళల అక్షరాస్యత 60 శాతం కన్న తక్కువ ఉన్న ప్రాంతాలు, ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ బ్లాకులు, తీవ్రవాద ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.

వయోజనులకు మేలు

అజ్మీర పురుషోత్తం నాయక్, వయోజన విద్యాధికారి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నవభారత్ సాక్ష రత కార్యక్రమం ద్వారా వయోజనులకు మేలు జరుగుతుంది. వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే కాకుండా జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. ఉపాధ్యాయులు, ఉన్నత విద్యావంతుల సహకారంతో కార్యక్రమం కొనసాగ నుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే సాక్షరభా రత్ పథకం బదులుగా నవభారత్ సాక్షరతా పేరుతో శ్రీకారం చుట్టింది. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం




రామకృష్ణాపూర్, మే 19: రామకృష్ణాపూర్ సివి రామన్ ఉన్నత పాఠశాల పదో తరగతి 1998-99 బ్యాచ్ సిల్వర్ జూబ్లీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. సింగరేణి జీవన విధానాన్ని ప్రతిబింబించేలా రచయిత గురిజాల రవిందర్‌రావు రాసిన బొగ్గు రవ్వలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ గురిజాల రవిందర్‌రావు, ప్రధానోపాధ్యాయులు సురేందర్ రావు, ఉప్పలయ్య, చిరంజీవి, రమేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: మంచిర్యాలలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మైక్రో బయాలజీ చదివిన వారు 20 ఏండ్ల క్రితం ఆదివారం మంచిర్యాలలోని వీ కన్వెన్షన్ హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉత్సాహంగా గడిపారు. సహ విద్యార్థి జిల్లా రచయితల వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు మహేందర్‌ను సన్మానించారు. రాజేష్, మల్లాగౌడ్, రమేష్, నరేష్, స్రవంతి, స్వప్న, పాల్గొన్నారు.

ముగిసిన పోచమ్మ కొలుపు, ఊరు కట్టడి


పోచమ్మ కొలుపులో పాల్గొన్న పూజారులు, ప్రజలు

ఏసీసీ, మే 19: మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాలలో శనివారం నుంచి నిర్వహిస్తున్న ఊరు పోచమ్మ కొలుపు, గ్రామ కట్టడి కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఆదివారం ఉదయం భూలక్ష్మీ, మహాలక్ష్మీ దేవతల వద్ద పాల పొరకతో పందిరి వేశారు. అమ్మవార్లకు పట్టు పరిచి పంబాల పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఊరి పొలిమేరల్లో కట్టడి పూజలు చేశారు. పోచమ్మ దేవత చరిత్రను కళాకారులు కథలుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు , రామాలయం , శివాలయం ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డున్నా బస్సు సౌకర్యం కరువు

- ఏళ్లుగా ఇదే తంతు
- 50గ్రామాలకు వెళ్లని ఆర్టీసీ బస్సులు
- ప్రైవేటును ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


గ్రామాలకు ఉన్న బీటీ రోడ్డు

కెరమెరి, మే 19: ఆర్టీసీ అధికారులు గ్రామాలకు రోడ్డున్నా బస్సు సౌకర్యం కల్పించడం లేదు. ఏళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. సుమారు 50గ్రామాలకు బస్సు నడవక ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆయా రూట్లలో బస్సు నడిపించడం ద్వారా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా గ్రామస్థులు పని నిమిత్తం ప్రైవేటు వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాల్లో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

● బస్సులు నడిపితే ఆదాయం..

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కోట్ల రూపాయలతో రోడ్లు నిర్మిస్తున్నాయి. కానీ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పల్లెల్లో బస్సులు కనిపించడం లేదు. మండలంలోని కెరమెరి నుంచి అనార్‌పల్లి మీదుగా నార్నూర్ వరకు ఏడేళ్ల క్రితం రూ.2 కోట్లతో అనార్‌పల్లి క్రాస్ రోడ్డు నుంచి మలంగి వరకు 13కిలో మీటర్ల తారు రోడ్డు నిర్మించారు. ఆ రూట్ వైపు సుమారు 27 గ్రామాలు, లెండిగూడ వైపు 7, ఇందాపూర్ వైపు 15 గ్రామాలు ఉన్నాయి. ఆయా రహదారులపై ప్రతినిత్యం వందల సంఖ్యలో ప్రజలు కెరమెరి ఇతర గ్రామాలకు ప్రయాణిస్తుంటారు. ఈ రూట్లలో ఆర్టీసీ బస్సులు నడిపితే ఆదాయం వచ్చే అవకాశం ఉంది. దేవాపూర్, తుమ్మగూడ, బొగడగూడ, చిత్తగూడ, గోర్నా గూడ, లక్మాపూర్, మలంగి, పరందోలి, కోటా నారాయణ గూడ, శంకర్‌లొద్ది, కెలి(కె), కెలి(బి), సాంగ్వీ, లేండిగూడ, ఇందాపూర్, ఉమ్రి, నాగల్‌గొంది, నీంగూడ, ఆగర్‌వాడతో పాటు మరో 26 గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కాగా గతేడాది కొద్ది నెలలు బస్సులు నడిపించినా తరువాత రద్దు చేశారు. బస్సులు నడపాలని, అధికారులను కోరుతున్నా స్పందించడం లేదని ఆయా ప్రాంతాల గిరిజనులు చెబుతున్నారు.


పరిమితికి మించి వెళ్తున్న ప్రయాణికులు(ఫైల్)

● తీర్మానాలకే పరిమితం..

ప్రతి మండల సర్వసభ్య సమావేశాల్లో అన్ని రూట్ల వైపు బస్సు నడపించాలని తీర్మానాలు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. ఆర్టీసీ అధికారులు హాజరై ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ప్రయాణం..

బస్సు లేక ఆటోలే దిక్కవుతున్నాయి. ఇరుకుగా కూర్చుని ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి మా గ్రామాలకు బస్సులను నడిపించాలి.

- ధర్ము, నాగల్‌గొంది

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కాగజ్‌నగర్ టౌన్/సిర్పూర్(టి), మే 19: కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని అప్ లైన్‌లో ఆదివారం రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. ఆదివారం ఉదయం తమకు అందిన సమాచారం మేరకు ఆప్‌లైన్‌లో పరిశీలించగా మంచిర్యాల నుంచి మహారాష్ట్ర వైపు వెళుతున్న రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. మృతిడి ఎడమ చేతిపై కేయూఎంటీఏ అని రాసి ఉన్నట్టు తెలిపారు. కుడి చేతి భుజంపై త్రిశూలం గుర్తు పచ్చబొట్టు ఉందన్నారు. మృతదేహాన్ని సిర్పూరు సివిలాసుపత్రి మార్చురీకి తరలించినట్టు, ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712658596లో సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీ కొని ఒకరికి తీవ్ర గాయాలు

దహెగాం, మే 19: దహెగాం మండలం కల్వాడ గ్రామంలో ఆదివారం ద్విచక్ర వాహనం ఢీ కొని సాలిగాం గ్రామానికి చెందిన గోలేటికి శంకర్‌కు తీవ్ర గాయాలు అయినట్లు ఎస్సై రాజు తెలిపారు. శంకర్ పని నిమిత్తం సాలిగాంకు వచ్చిన వెళ్తుండగా కల్వాడ గ్రామానికి చెందిన సామెర శేఖర్ ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ శంకర్‌ను వెనక వైపు నుంచి ఢీ కొట్టడంతో నడుము భాగంలో తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. శంకర్ కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న 'కవ్వాలి'



కవ్వాలి నిర్వహిస్తున్న కళాకారులు

సిర్పూర్(టి), మే 19: మండల కేంద్రంలో ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు కవ్వాలి సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. మొదటి రోజు నిర్వహించిన కవ్వాలి సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమం తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దర్గా వద్ద కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదీక్‌పాషా, ఎస్సైలు బందో బస్తు చేపట్టారు. ఆదివారం గుర్రాలతో మండల కేంద్రంలో పలు వీధుల గుండా సందల్‌ను నిర్వహించారు.

శిథిలావస్థలో ఈఎస్ఐ ఆస్పత్రి

- క్వార్టర్స్ ఖాళీ చేయాలని నోటీసులు జారీ

కాగజ్‌నగర్, మే 19: కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆసుపత్రి, సిబ్బంది నివాసం ఉండే క్వార్టర్లు పూర్తిగా దెబ్బతినగా, క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న సిబ్బంది వెంటనే ఖాళీ చేయాలని ఆరునెలల క్రితం సూపరింటెండెంట్ నోటీసులు ఇచ్చారు. అలాగే అత్యవసరమున్న పేషంట్ల స్థానికంగా ఉండే ప్రయివేటు ఆసుపత్రులకు రెఫరల్ సౌకర్యం కల్పించటం బట్టి పరిశీలిస్తే ఇక్కడి నుంచి ఆసుపత్రిని రామగుండంకు మార్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. పార్లమెంటు ఎన్నికలు ఉండటంతో ఈ ప్రక్రియ నిలిచిపోయిందని, ఎన్నికలు కాగానే బదిలీ చేసే ప్రక్రియ మొదలయ్యేట్టు ఉందని సిబ్బంది అంతా హైరానపడుతున్నారు.

● ప్రత్యేక కమిటీ అధ్యయనం..

ఈఎస్ఐ భవనం శిథిలావస్థకు చేరుతుండటంతో గత ప్రభుత్వం ప్రత్యేక కమిటీని వేసిన అధ్యయనం చేయించింది. ఈ కమిటీలో ఈ భవనం పూర్తిగా తొలగించాలని స్పష్టమైన నివేదికలను సమర్పించింది. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో 13వేల ఈఎస్ఐ కార్డులున్నాయి. వీరందరికి వైద్యం అందించాల్సి ఉంది. ఇక్కడున్న 50 మంది డాక్టర్లు, ఇతర సిబ్బందిని రామగుండంకు బదిలీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ఇందులో బాగంగా ప్రిన్సిపాల్ లేబర్‌సెక్రెటరీ అధికారి అజిత్ కూడా ఈ భవన పరిస్థితిపై పూర్తి నివేదికలు తెప్పించుకున్నారు. ఇక్కడి భవనం కూలిపోయిందుకు సిద్ధంగా ఉండటంతో ప్రస్తుతం వైద్యసేవలు డిస్పెన్సరీ ద్వారా అందిస్తున్నారు. ఈ ప్రాంతంలో అతి పెద్దపరిశ్రమ ఉండగా, కార్మికులు వైద్యసేవలు అందించేందుకు సౌకర్యం ఉన్నట్టు అంతా చెబుతున్నారు. ఆసుపత్రిని కూల్చి నూతన ఆసుపత్రిని వెంటనే నిర్మించాలని కార్మికులు కోరుతున్నారు.



ఈఎస్ఐ ఆస్పత్రి భవనం

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు


ఇళ్లపై నుంచి వేలాడుతున్న విద్యుత్ వైర్లు

కెరమెరి, మే 19: మండలంలోని గోయగాం, ధనోర, జ్యోతినగర్ గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ తీగలు ఏళ్లుగా ఇళ్లపై నుంచి వేలాడుతున్నా విద్యుత్ అధికారులు పట్టించున్న దాఖలాలు లేవని గ్రామస్థులు వాపోతున్నారు. అసలే ఎండాకాలం ఈదురుగాలులు వస్తుండడంతో విద్యుత్ తీగలు పడి గతంలో ప్రమాదాలు సైతం జరిగాయి. సుమారు 60 ఏళ్ల క్రితం గ్రామాలు ఏర్పడగా ముందుగా అక్కడ వేసిన విద్యుత్ వైర్లు నేటికీ అలాగే ఉన్నాయి. వైర్లు తగిలిపడడం, చిన్న చిన్న మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ శాఖ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు చెబుతున్నారు. గతంలో విద్యుత్ వైర్లు తెగి పడి పశువులు మరణించిన సందర్భాలు సైతం ఉన్నాయి. ఈ గ్రామాల్లో రైతులు తమ పశువుల కోసం గ్రామంగా వినియోగించే జొన్న చొప్ప తమ ఇంటి ముందుర పందిర్లపై నిలువ ఉంచుకుంటారు. కాగా విద్యుత్ వైర్లు ఒకటికొకటి తగిలి తెగి పడ్డ సందర్భంగా నిప్పురవ్వలు ఏర్పడి పశుగ్రాసంపై పడి అగ్ని ప్రమాదాలు సైతం ఏర్పడే ప్రమాదం పొంచి ఉన్నట్లు గ్రామాల రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి 11 కేవీ విద్యుత్ లైన్‌ను మరో చోట ఏర్పాటు చేయాలని గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. గతంలో గ్రామాల పర్యటనకు వచ్చిన ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. అంతే కాకుండా విద్యుత్ స్తంభాలు వంగి వర్షాలకు పడి పోయే ప్రమాదం పొంచి ఉంది.



చర్యలు తీసుకోవాలి..

ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ నేటి కీ అలాగే ఉంది. అనేక సార్లు వైర్లు తెగి పడి పశువులు మరణించిన సందర్భాలు ఉన్నాయి. మా గ్రామానికి వచ్చిన అధికారులు, నాయకుల దృష్టికి సమస్యను వివరించినా మాత్రం పట్టించుకోవడం లేదు. వెంటనే లైన్‌ను మరో చోటికి మార్చాలి.

- లింగయ్య, గోయగాం గ్రామస్థుడు


వంగి ఉన్న విద్యుత్ స్తంభం

పశుగ్రాసం కోసం రైతుల పాట్లు


పశుగ్రాసం ఎడ్లబండ్లలో తీసుకెళ్తున్న రైతులు

కౌటాల, మే 19: కౌటాల మండలంలో పశుగ్రాసం దొరకక రైతులు ఇక్కట్లు పడుతుండగా మేత కోసం పశువులు అల్లాడుతున్నాయి. ఎండలకు పశువులు అడవికి వెళ్లినాకూడా గ్రాసం దొరకక అల్లాడుతు న్నాయి. కొంతమంది రైతులు విధిలేని పరిస్థితుల్లో తమ పశువులను కబేళాలకు అమ్ముకుంటున్నారు. మండలంలో గతంలో సాండ్‌గాం లిఫ్టు ఇరిగేషన్ పనిచేయడంతో పశు గ్రాసం లభించేంది. ప్రస్తుతం పంటలు వేయక పోవడంతో పశుగ్రాసానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో బోర్లకింద రెండో పంట వేసిన రైతుల వద్దకు వెళ్లి వారిని బతిమిలాడి వారు వేసిన పంటలలో వారి పశువులకు మిగిలింది ఇస్తే కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు.

'స్థానిక' ఎన్నికలపై నజర్



పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల దృష్టి స్థానిక సంస్థల వైపు మళ్లింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చెమటోడ్చిన ద్వితీయ శ్రేణి నాయకులు, గ్రామస్థాయి నాయకులకు అవకాశం కల్పించేందుకు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు చర్యలు తీసుకుంటున్నారు.

- దృష్టి సారించిన రాజకీయ పార్టీలు
- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడ్డ వారికి ప్రాధాన్యం ఇచ్చేందుకు కసరత్తు
- పట్టు కోసం బీఆర్ఎస్ పాట్లు
- హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ పావులు

జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నా యి. గత ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎక్కువ స్థానాలు కైవసం చేసుకున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అధికారం కోల్పోవడంతో ప్రస్తుతం క్యాడర్ ప్రభావం తగ్గినట్లు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు స్థానిక సంస్థల్లోను అధిక మెజార్టీ సర్పంచ్‌లను కైవసం చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో ప్రధాన పార్టీల నాయకులు కాంగ్రెస్, బీజేపి, బీఆర్ఎస్ పార్టీలను బలోపేతం చేసేందుకు చేరికలపై దృష్టి సారిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న అధికార కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. స్థానిక సంస్థలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రక్రియను చేపడుతున్నారు.

కాగజ్‌నగర్ టౌన్, మే 19: పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రధాన పార్టీలు ఇక స్థానిక సంస్థల ఎన్నికలపై గురి పెట్టాయి. జిల్లాలోని వివిధ మండలాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు సంబంధించిన బలమైన అభ్యర్థుల కోసం గురి పెడుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో క్రియాశీలకంగా పని చేసిన కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వాలన్న చర్చ ఆయా పార్టీల నాయకుల్లో కొనసాగుతోంది. వచ్చే నెలలో పార్లమెంటు ఎన్నికల ఫలితాల అనంతరం సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు గాను ఓటరు జాబితా పార్లమెంటు ఎన్నికల్లో వినియోగించుకున్న వాట ఆధారంగానే చేయనున్నారు. అయితే సర్పంచి ఎన్నికలకు పార్టీల గుర్తులుండవు, కేవలం ఎన్నికల అధికారులు కేటాయించిన గుర్తులతోనే బరిలో ఉండే పరిస్థితి ఉంటుంది. దీన్ని ఆసరగా తీసుకొని అన్నీ పార్టీల నాయకులు బలమైన గెలుపు గుర్రాలపై కన్నేశారు. కచ్చితంగా కీలక నాయకుడిని బరిలో నిలిపితేనే ప్రజల మద్దతు ఉంటుం దన్న విషయాన్ని పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకయ్యే ఖర్చులపై కూడా చర్చించుకుంటున్నారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు స్థానిక సంస్థలపై ప్రభావం చూపితే పరిస్థితి ఏంటన్న విషయంపై కూడా తీవ్రంగా చర్చ జరుగుతోంది. జిల్లాలో పార్లమెంటు ఎన్నికల్లో తీవ్ర పోటీ జరిగిన నేపథ్యంలో జరిగే ఈ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అన్నీ పార్టీల నాయకులు తమకే మెజార్టీ వస్తోందన్న మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ వైపు మొగ్గు చూపే పరిస్థితి లేదు. రాష్ట్రంలో అధికారం కాంగ్రెస్ ఉండగా, ఎంపీ ఎన్నికల్లో ఫలితాలు అధికార పార్టీ వైపు ఫలితాలు రాకుంటే స్థానిక సంస్థల్లో ఎవరి ప్లస్ అవుతుందో..? ఎవరికి మైనస్ అవుతోందనని లెక్కలు వేసుకుంటూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కార్యకర్తల చేరికకు..

కుమరం భీం జిల్లాలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందగా, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు బీజేపీ నుంచి గెలిచారు. ఆయా పార్టీల నుంచి తమ పార్టీ వైపు మొగ్గు చూపే వారిని చేర్చుకునేందుకు అగ్రనాయకత్వం దృష్టి సారించింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీలో క్యాడర్ బలోపేతం కోసం ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ సిర్పూరులోనే మకాం వేసి దృష్టి సారిస్తున్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షు డిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనేప్ప కాంగ్రెస్‌లో చేరిన అనం తరం పార్టీ పరిస్థితి గాడి తప్పినట్లయింది. ఎమ్మెల్సీ దండే విఠల్ సిర్పూరు, కౌటాల, బెజ్జూరు, దహెగాం, చింతలమానేపల్లి మండలాల్లోని కార్యకర్తలతో తరుచూ మాట్లాడుతూ ప్రజల్లో ఉండేలా చర్యలు తీసు కుంటున్నారు. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను ఇం టింటా వివరిస్తున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఇప్పటి నుంచే పార్టీ నాయకత్వం, క్రియాశీల సభ్యత్వాలను అధికంగా చేసుకుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్న ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే హరీష్‌బాబు ఉండడం, తండ్రి పాల్వాయి పురుషోత్తం రావు క్యాడర్ ఉండడం ఆ పార్టీకి కలిసి వచ్చే అవకాశంగా చెబుతున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నుంచి తెచ్చిన నిధులపై ముమ్మర ప్రచారం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ కూడా కార్యకర్తలను కలుస్తూ క్యాడర్ పెంచేందుకు కృషి చేస్తున్నారు. ప్రధాన పార్టీల నాయకులు తమ క్యాడర్‌ను గెలిపించుకోవడం ద్వారా పట్టు నిలుపుకునేందుకు పావులు కదుపుతున్నారు.

శ్రామికభవన్ నిర్మాణానికి సహకరించాలి

శ్రీరాంపూర్, మే 19: శ్రీరాంపూర్‌లోని ఆర్కె 8 కాలనీలో శ్రామికభవన్ నిర్మాణానికి సహకరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయు) జాతీయ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్ కోరారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌహతిలలో 1978లో ప్రారంభమైన ఐఎఫ్‌టీయు గత నాలుగున్నర దశాబ్దాలుగా కార్మికులు, ప్రజలకు సేవలందిస్తోందన్నారు. చికాగో, నెల్లిమర్ల అమరుల స్ఫూర్తితో ముందుకు సాగుతోందన్నారు. కార్మిక సంఘాలు వ్యాపార సంస్థలుగా మారిన నేటి సమాజంలో ఐఎఫ్‌టీయు మాత్రం అవినీతికి తావులేకుండా సమ సమాజ స్థాపనకు, కార్మికవర్గ శ్రేయస్సుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నో ప్రజా సమస్యలపై పోరాడుతున్నట్లు వివరించారు. సింగరేణిలో వేజ్‌బోర్డు సాధన, కార్మికులకు పలు హక్కులు కల్పించడం, కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్, బ్యాంకు వేతనాలు, పనిభద్రత, ఇతర సదుపాయాలు కల్పించి అగ్రభాగాన నిలిచామన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికవర్గానికి మరింత చేరువలో ఉండేందుకు, సేవలు అందించేందుకు ఆర్కె 8 కాలనీ ప్రాంతంలో శ్రామిక భవన్(ఐఎఫ్‌టీయు కార్యాలయం) నిర్మిస్తున్నామని, ప్రజలు, కార్మికులు ఆర్థిక, వస్తురూపేణా సహకరించాలని కోరారు. సమావేశంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం, డివిజన్ ప్రధాన కార్యదర్శి యు యాదగిరి, ఉపాధ్యక్షుడు మాడుగుల శంకర్, రాష్ట్ర నాయకురాలు జి. శోభ, పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి, నాయకులు అశోక్, సదానందం, అప్పారావు, సోమయ్య, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెంచికలపేట/కన్నెపల్లి, మే 19: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కన్నెపల్లి ఎస్సై గంగారాం తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికలపేట మండలం గుంట్లపేట గ్రామానికి చెందిన గడ్డం రాములు- వెంకటమ్మ దంపతుల కుమారుడు రాకేష్(22) బొలేరో వాహనం నడుపుతూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండే వాడు. కుటుంబ సభ్యులు ఆదివారం మొక్కులు చెల్లించుకునేందుకు ఎల్లారం పోచమ్మ దేవాలయానికి వెళ్లారు. మధ్యాహ్నం తాగు నీటి కోసం తన స్నేహితుడు శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో జన్కాపూర్ గ్రామ సమీప మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడి పోయాడు. రాకేష్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంట ఉన్న స్నేహితుడు శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో శ్రీకాంత్‌ను మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. రాకేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిలిచిన రోడ్డు పనులు

- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా ఉన్న ఖమన రోడ్డు

వాంకిడి, మే 19: గుంతలతో అధ్వానంగా తయారైన రహదారిని తిరిగి నిర్మించేందుకు చేపట్టిన పనులు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కంకర పనులు పూర్తి చేసి తారు వేయకపోవడంతో గత నాలుగు నెలలుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకయాతన పడుతున్నారు. మండలంలోని వాంకిడి నుంచి ఖమన గ్రామం వరకు గతంలో నిర్మించిన రోడ్డు గుంతలమయంగా మారడంతో నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో గతేడాది ప్రభుత్వం నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.57 కోట్లు నిధలు మంజూరి చేసింది. గతేడాది పనులు ప్రాంభించిన గుత్తేదారు రోడ్డుపై ఉన్న బీటీని తొలగించి పనులు ప్రాంభించారు. కొద్ది రోజుల్లోనే వర్షాకాలం ప్రారంభం కావడంతో పనులను నిలిపివేశారు. ఏడాది పాటు ఈ రోడ్డుపై నడవలేని పరిస్థితిని ఎదుర్కుంటున్న ప్రజలు ఆందోళనకు దిగారు. దీంతో ఉన్నతాధికారులు సదరు గుత్తేదారుతో మాట్లాడి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. నాలుగు నెలల క్రితం తిరిగి పనులు ప్రారంభించిన సదరు గుత్తేదారు కంకర పోసి పనులను నిలిపివేశాడు. దీంతో గత నాలుగు నెలల నుండి ప్రజలు ఈ రోడ్డుపై నడవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు కంకరపై నుంచి వెళ్తుండడంతో దుమ్ము, ధూళితో ప్రజలు రాకపోకలు సాగించలేదని పరిస్థితి నెలకొంది. కంకర పోసి ఉండడంతో దిచక్రవాహనాలు అదుపు తప్పి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. ఖమన గ్రామంలో పాటు కోమటిగుడ, కనర్‌గాం, లక్ష్మీపూర్, వెల్గి, ఖేడేగాం, లేన్‌గుడ తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లి రావాలంటే కంకర తేలిన రోడ్డుతో తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి..



రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి. ఏడాది నుంచి రోడ్డు పనులు నత్త నడకన కొనసాగిస్తున్నారు. ఖమన గ్రామం నుంచి వాంకిడి మండల కేంద్రం వరకు కంకర పోసి నాలుగు నెలలు కావస్తున్న బీటీ పనులు ప్రారంభించలేదు. దీంతో ఈ రోడ్డుపై ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది. రోడ్డు పనులు పూర్తి చేయాలని పలుమార్లు ఆందోళన చేసి జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోతుంది. రోడ్డు పనులను నిలిపి వేసిన సదరు గుత్తేదారు కూడా స్పందించడం లేదు. సంబంధిత అధికారులు వెంటనే పనులు పూర్తి చేయాలి. లేని పక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపడతాం.

- టేమాజీ- ఖమన గ్రామస్థుడు

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు

ఆసిఫాబాద్, మే 19: అమాయక దళితుల భూములను ఆక్రమించుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో బాధితులతో కలిసి ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలమానేపల్లి మండలం బాలాజీఅనుకోడ, రన్‌వెల్లి శివారులో శంకరయ్య, సూర్యాదాస్, కొండయ్య, సోమయ్య, రుషి, విజయ్‌కి చెందిన దాదాపు 40 ఎకరాల భూమిని నాన్నయ్య, చిన్నక్క , ప్రేంకుమార్, నాగేశ్వరరావు, జయపాల్, పురుషోత్తంలు అక్రమంగాపట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. పెత్తందారులు దళితులపై దౌర్జన్యానికి పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేసి అర్హులకు పట్టాలు అందజేయాలని కోరారు. వారి భూములకు వారికి చూపించాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకు శంకర్, బాధితులు శంకరయ్య, సూర్యాదాస్, విజయ్, సోమయ్య, రుషి, కొండయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేగుంట కేశవరావు

కాలువలు అధ్వానం

- సాగునీరు ప్రశ్నార్థకం - ఆందోళనలో అన్నదాతలు

బెజ్జూరు, మే 19: మండలంలోని గొల్లబాయి చెరువు ద్వారా ఏటా సాగునీరందిస్తున్నా కొంత కాలంగా పూడికతీతపనులపై దృష్టి సారించకపోవడంతో చివరి ఆయకట్టుకు నీళ్లందడం ప్రశ్నార్థకంగా మారుతోంది. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు చెరువు పూర్తిస్థాయిలో నిండినా కాలువల్లో పూడిక నిండిన కారణంగా సాగు నీరందక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం సమీపంలోని గొల్లబాయి చెరువు 2007లో నిర్మించారు. దీని ఆయకట్టు కింద 1,200ఎకరాలు సాగు లక్ష్యంగా ఉన్నప్పటికీ కాల్వల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు. అప్పట్లో నిర్మించిన కాల్వలు ప్రస్తుతం పూర్తిగా పూడికతో నిండింది. చెరువు కాల్వల్లో పూడిక నిండటంతో పాటు దట్టమైన పొదలు పెరగడంతో సాగు నీరు బయటకు రావడం లేదు. మరి కొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండగా రైతుల్లో ఆందోళన మొదలైంది. గత నాలుగేళ్లుగా చెరువు కాల్వల్లో పూడిక తొలగించి మరమ్మత్తులు చేపట్టాలని ఆయకట్టు రైతులు విన్నపిస్తున్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

ఉమ్మడి ప్రభుత్వ హయాంలో..

గొల్లబాయి చెరువు నిర్మాణం ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు అప్పటి ఉమ్మడి ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కృషితో గొల్లబాయి చెరువు నిర్మాణం జరిగింది. 1,200ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో నిర్మించారు. కాగా చెరువు ప్రస్తుతం 400ఎకరాలకు కూడా నీరందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయకట్టు రైతులకు రెండు పంటలకు సాగునీరందించాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. ఒక్కోసారి వేసవిలోను నీటితో కళకళలాడుతున్న చెరువు పొలాలకు నీరందించే కాల్వల్లో పిచ్చి మొక్కలు పెరిగి పూడికతో నిండి ఉంది. దీంతో అవి ఆనవాళ్ల కోల్పోయాయి. ఏ ఒక్క కాలువ కూడా సక్రమంగా లేనందున ఆయకట్టులో వానాకాలం పంటలకు మాత్రమే సాగు నీరందుతోంది. కాల్వలకు మరమ్మత్తులు చేపట్టని కారణంగా పొలాలకు సాగు నీరందక ఆయకట్టు రైతులు నష్టపోతున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కాకముందే కాలువలకు మరమ్మత్తులు చేపట్టినట్లయితే రైతులకు మేలు చేకూరే అవకాశం ఉంది.



పూడికతో నిండిన గొల్లబాయి చెరువు కాలువ

మరమ్మతులు చేపడితే..

పూడిక, పిచ్చి మొక్కలతో నిండిన గొల్లబాయి చెరువులో అధికారులు స్పందించి మరమ్మతులు చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. చెరువు కింద ఉన్న కాలువల్లో పూడిక తొలగించడంతో పాటు పిచ్చి మొక్కలు తొలగించాలి. కాలువ్లో నిండిపోయిన మట్టిని తొలగిస్తే సాగునీరు పొలాలకు పారే అవకాశం ఉంది. గతంలో ఉన్న కాలువలు కాకుండా మరిన్ని కాలువలు నిర్మిస్తే పూర్తిస్థాయిలో ఆయకట్టు రైతులకు నీరందే అవకాశం ఉంటుంది. ప్రతీఏటా వానాకాలం ముందే చెరువు కాలువల్లోని పూడిక, పిచ్చి మొక్కలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఆయకట్టు రైతులకు ఖరీఫ్, యాసంగి పంటలకు సీగునీరు అందించే అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వాంకిడి, మే 19: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988 లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరవేసుకున్నారు. 36 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు పలకరించుకొని వారి జీవన స్థితిగతులు తెలుసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు లచ్చారెడ్డి, సాబయ్యను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఆనాడు చదువుకున్న విద్యార్థుల సమాచారం సేకరించి అందరిని ఈ ఆత్మీయ సమ్మేళనానికి వచ్చేలా కృషి చేసిన విద్యార్థులు నడిపల్లి వెంకటేశ్వర్‌రావు, అల్లోజు రవి, దర్గం రాకేష్, తుకారాంలను ఈ సందర్భంగా అభినందించారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ బాలభారతి పాఠశాలలో పదవ తరగతి చదివిన 1994-95 లో పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఒక్క చోట కలుసు కున్నారు. ఈ సందర్భంగా అప్పుడు తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. అనంతరం చిన్ననాటి మిత్రులతో కలిసి గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. పలు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఖాజ వసీమొద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్ టౌన్, మే 19: కాగజ్‌నగర్ పట్టణంలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు, చెట్ల కొమ్మలు కొట్టే పనిలో భాగంగా విజయబస్తీ, సర్దార్ బస్తీ, సంఘం బస్తీ, స్టేషన్ రోడ్డు ఏరియాలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కమలాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీవీటీజీ కళాశాలలో ప్రవేశాలు

ఆసిఫాబాద్, మే 19: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీవీటీజీ గిరిజన గురుకుల కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ హయత్‌నగర్ పీవీటీజీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులలో ప్రవేశం పొందడానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కోలాం, తోటి, మన్నె (కోలావార్))తెగలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బాలుర వేశాల కోసం పీవీటీజీ కళాశాల (9533978080), బాలికల కోసం (9908234 978)లను సంప్రదించాలని తెలిపారు. ఇంటర్‌తో పాటు జేఈఈ, నీట్, క్లాట్, ఎంసెట్ కోచింగ్‌లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

దరఖాస్తులకు నేటితో ముగియనున్న గడువు

ఆసిఫాబాద్, మే 19: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ గురుకులంలో 11వ తరగతిలో ప్రవేశానికి సోమవారం చివరి తేదీ అని కాగజ్‌నగర్ ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ సాయిలు తెలిపారు. ఆదివారం పలువురు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 24న ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్, మే 19: కేంద్రంలో ఆదివారం దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట రథసారధి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు మాట్లాడుతూ ఆయన ఆశయాల సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దినకర్, టీకానంద్, మలశ్రీ, తిరుపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



ప్రణయ్‌ని సన్మానిస్తున్న జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, మే 19: మహాత్మజ్యోతిభాపూలే అవార్డు గ్రహీత ఆవిడపు ప్రణయ్‌ని ఆదివారం జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే ఆలోచన సిద్దాంతంతో భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ప్రసాద్‌గౌడ్, టీసీ నాయకుడు వెంకన్న, ముషీరొద్దీన్, సత్తయ్య, సాయి, కృష్ణ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను పారదోలుదాం

ఆసిఫాబాద్ రూరల్, మే 19: ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి తుకారాం భట్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, సంఘీభావంతో, గతం నేర్పిన పాఠాలతో బంగారు భవిత నిర్మిద్దామని, హెచ్ఐవీ పరిధిని దాటి ఆరోగ్యవంతంగా జీవిద్దామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సుధాకర్‌నాయక్, డాక్టర్ వినోద్, సీఎస్ఓ రాజేశ్వర్, డీఎండీఓ సంతోష్, ఐసీటీసీ కౌన్సిలర్ సతీష్,హరీష్, రవీందర్,రఫి, రాజశేఖర్, చేతన స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సతీష్, సాయిమహిళా మండలి ప్రాజెక్టు మేనేజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది